# తృప్తి

'అమ్మయ్య ! ఈ రోజు నేను అనుకున్నది సాధించాను! నాకెంత తృప్తిగా ఉందో?' అనుకున్న కొన్నాళ్ళకే... మనిషి మనసులో మరో యాంబిషన్ మొలకెత్తి, దానికోసం ఆరాటాలూ, పోరాటాలూ మొదలవుతాయి !

'ఈ మనిషి ఇలా ఇంకా ఎన్నింట్లో వేలెడ్తాడు? ఆశకు అంతుండాలి! ఉన్నవి సరిపోలేదా ? ఇంకా ఇంకా సంపాదించాలన్న తపన ఎందుకో? ' అనుకుంటారు అతనంటే గిట్టని వాళ్ళు.

కేవలం డబ్బుమీదే కాపీనం ఉన్న వ్యక్తులకైతే ఒక రంగం చాలు ! పది రంగాలు అక్కర్లేదు ! చిట్‌ఫండ్స్ రంగంలో రారాజులా వెలిగిన వ్యక్తి చిట్‌ఫండ్స్ నిర్వహణతో సరిపెట్టుకోలేదు ! పత్రికలూ, పచ్చళ్ళూ, సినిమాలూ, టీవీ ఛానళ్ళూ - వాట్‌నాట్... ఒక దానితో ఒకటి సహసంబంధంలేని రంగాలు ఎన్నుకొని ఘనవిజయం సాధించడం మనం చూస్తూనే ఉన్నాం.

ఇలాంటి వ్యక్తులు ఒకదానితో తృప్తిపడి 'ఇహ చాల్లే' అనుకునే అల్ప సంతోషులు కారు. తమ శక్తి సామర్థ్యాలతో ఎప్పటికప్పుడు ఎవరి ఊహకీ అందని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్న తపన - వాళ్ళు వేసే ప్రతీ అడుగులో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.ఒక పని పట్ల తపన, అది సఫలీకృతం కావడానికి చేసే నిర్విరామ కృషి మాత్రమే ఇలాంటి వాళ్ళకు తృప్తినిస్తాయి !

ఏదైనా ఒక పని పూర్తి చేస్తున్నప్పుడు అందులో ప్రతీదీ సవ్యంగా ఉండాలనుకుంటారు కొందరు ఆఫీసర్లు! లోపమేదైనా కన్పిస్తే సర్లెమ్మని సరిపెట్టుకోరు! చేస్తోన్న పనిలో పర్‌ఫెక్షన్ వస్తేగానీ సంతృప్తి పడని ఇలాంటి వాళ్ళు తమ బుర్రలకే గాక తమ సబార్డినేట్స్ బుర్రలక్కూడా 'పదును' పెట్టి వాళ్ళని కూడా తమలాగే చాకుల్లా తయారు చేస్తారు!

మన చుట్టూ ఉండే మనుషులని పరికిస్తే కొందరు ఎప్పుడు చూసినా ఎంతో తృప్తిగా చీకూ చింత లేకుండా హాయిగా ఉన్నట్టు కన్పిస్తారు ! వాళ్ళ సన్నిహితులకి వాళ్ళ సమక్షం ఎంతో తృప్తినిస్తుంది !

మరి కొందరు తమకెన్ని ఉన్నా - ఎప్పుడూ ఏదో దిగుల్తో.... అక్కడికీ భూభారాన్నంతా తమ భుజస్కందాల మీదే మోస్తున్నట్టుగా అసంతృప్తిగా ఉంటారు! ఇలాంటి వాళ్ళతో సహవాసం వాళ్ళ కుటుంబ సభ్యులకు నిప్పులకుంపట్లో కూర్చున్నట్టు - దుర్భరంగా ఉంటుంది !

మన సాన్నిధ్యం ఎదుటి వాళ్ళ అసంతృప్తిని పటాపంచలు చేసేదైతే... మన దగ్గరికి జనం పోలోమని క్యూలు కడ్తారు. మన అసంతృప్తి ఎదుటివాడి తృప్తిని కకావికలం చేసేదైతే మనని చూసి అదే జనం పారిపోవడం మొదలెడతారు!

తృప్తి అనేది అరచేతిలో పాదరసం లాంటిది! అది దొరికినట్టే దొరికి చేజారి పోతుంది! తమ గుప్పిట్లో దీన్ని పదిలంగా కాపాడుకోగలిగే వ్యక్తులు ప్రతి ఇంటా కనీసం ఒక్కరైనా ఉన్నప్పుడు... మనం ఏ ఇంటి గడప తొక్కినా - నవ్వుతూ దర్శనమిచ్చే మనుషులు కనిపించి - తృప్తిగా హాయిగా, ఆహ్లాదకరంగా ఫీలవుతాం!

1-11-1996